మొగలిరేకు

యామిని

(గత సంచిక తరువాయి)

మనసులో ఆమెపట్ల ఎంతో సానుభూతి కలిగింది. కాని తాను నేర్పుగా వ్యవహరించాలి. ఆమెను ప్రోత్సహించి తన సిబ్బందిలో అసంతృప్తినికూడా కలిగించలేదు.

"మీకభ్యంతరం లేకపోతే నేను కొన్ని ప్రశ్నలు వెయ్యవచ్చా?" అన్నాడు.

"నేను జవాబులకోసం వచ్చేను. మీరు ప్రశ్నలు వేస్తానంటున్నారు," అందామె కొంచెం ఆవేశంగా.

మర్యాద ఇచ్చిపుచ్చుకోవాలి. అలాగే జవాబులు కూడా! మీరు జవాబులు చెప్పిన తర్వాత మీకు కావలసిన వివరాలన్నీ నేనిస్తాను."

"ఓకే దెన్!"

"మీకీ వివరాలు ఎందుకు కావాలి?"

"మా పేపర్లో రిపోర్ట్‌చెయ్యాలి."

"చూడండి. మీరుచెప్పిన ఆ సెంటర్‌లోనే అవినీతికి పాల్పడిన ఎందరో స్త్రీలున్నారు. వారందరి కథలూ మీరు మీ పేపర్లో వేసేరా?"

"అవి కొన్ని కేసులు! దానిని పేపర్లలో వెయ్యడం వలన వాళ్ళ భవిష్యత్తుకు హాని కలగడమే కాకుండా స్త్రీత్వానికే అది అవమానం చేసినట్లవుతుంది."

సరిగ్గా అలాగే మా సిబ్బందిలో చాలా మంది ఎంతో మంచివారు. వాళ్ళ డ్యూటీ వాళ్ళు తప్పకుండా చేస్తారు. వారిలో కూడా అక్కడా అక్కడా ఈ ఆఫీసరులాగా వాళ్ళ అధికారాన్ని మితిమీరే వాళ్ళున్నారు. వారి కథలు మీరు పేపరులో వేస్తే పోలీసు డిపార్టుమెంటు అంతా ఇటువంటి వారేననే తప్పు అభిప్రాయం మీ పేపరు చదివిన వాళ్ళకు కలిగే అవకాశంఉంది. ఒక పత్రికా ప్రతినిధిగా ఇటువంటి వాటిలో మీరు కూడా కొంత విచక్షణ చూపించడం అవసరం అని నేననుకుంటున్నాను."

అని అతని గురించిన వివరాలు చెప్పేడు.

ఆ అమ్మాయికి ప్రసాద్ మాటలు ఎంతో నచ్చేయి. పత్రికలో ఈ విషయం రిపోర్టు చెయ్యనని నవ్వుతూ చెప్పి వెళ్ళిపోయింది.

ఆమె నవ్వుతూన్నప్పుడు మల్లె పూలు రాలినట్లుగా ఉంది. ఆమె వెళ్ళిన తర్వాత కూడా ఆమెరూపం అతని మనసులో నుండి చెరిగిపోలేదు.

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళేసరికి ఇంట్లో వాతావరణంఅంతా అసహజంగా తోచింది ప్రసాద్‌కి. సుశీల ముఖం కళావిహీనంగా ఉంది. ఎటో చూస్తూ తన అడుగుల చప్పుడువిని చటుక్కున తల తిప్పిన రుక్మిణి పిన్ని కళ్ళు తుడుచుకోవడం చూసేడు. తల్లికూడా అప్రసన్నంగా ఉంది.

రాత్రి పడుకోబోతూంటే అడుగులో అడుగు వేసుకుంటూ తల్లి దగ్గర కొచ్చింది.

"ఏమిటమ్మా?" అన్నాడు ప్రసాదు మంచంమీద కూర్చుని.

రాధ పైట కొంగులోంచి తీసిన ఉత్తరం ఒకటి ప్రసాద్‌కిచ్చి చదవమంది.

"ఏమిటమ్మా ఇది?"

"ఏమోనాయనా! మధ్యాహ్నం ఈ ఉత్తరం వచ్చినప్పటి నుంచి రుక్మిణి అదోలా అయిపోయింది. సుశీల ముఖం చిన్నబోయింది. నాకు ఏదో తెలీకుండ దాస్తున్నారనిపిస్తూంది...."

ప్రసాద్ ఉత్తరం చదివేడు. అతని ముఖం వివర్ణమైపోయింది. దీనంగా తల్లిముఖం చూసేడు.

"ఏముందిరా అందులో?" ఆతృతగా అడిగింది రాధ.

ప్రసాద్ గుటకలు మింగేడు.

"చెప్పునాయనా!" మీరిద్దరూ నానుండి ఏదో దాస్తున్నారు. చెప్పకపోతే నామీద ఒట్టే!...."

"అమ్మా!"

"చెప్పునాయనా!"

ప్రసాద్‌కి తప్పలేదు. "ఇది సుశీల మామగారు వ్రాసిన ఉత్తరం. పిన్ని కుటుంబానికీ ఒక వేశ్యకూ సంబంధం ఉన్నట్లు తెలిసిందనీ పెళ్ళిముందే ఈ విషయం చెప్పక మోసం చేసేరనీ, సుశీలను ఎన్నటికీ వాళ్ళింటికి తీసుకెళ్ళడం జరగదనీ వ్రాసేరు.

రాధ నెత్తిమీద పిడుగు పడ్డట్లయింది. కొంత సేపటికి కోలుకుంది. కొడుకు కళ్ళల్లోకి చూసింది. ప్రసాద్ జాలిగా తల్లి కళ్ళల్లోకి చూస్తున్నాడు. రాధ మెల్లగా లేచి వెళ్ళిపోయింది.

తీసిన చోటే ఉత్తరం పెట్టేసి వెనక్కి తిరిగింది, రుక్మిణి!

"నేనానాడే చెప్పేనమ్మా నా నీడ పడితే కాపురాలు నిలువవని! కాని నాతోనే ఉంటానని మొండిపట్టు పట్టేవు!

చూసేవా ఇప్పుడే మయింది?" అంది రాధ.

"జరగవలసింది జరుగుతుందక్కా! నీ నీడే పడకపోతే మొదటినుంచీ ఏమేమి జరిగేవో ఎవరు చూడొచ్చేరు! అసలు ప్రాణాలతో ఉండేవాళ్ళమో లేదో! అయినవాళ్ళు అడవిలో వదిలినట్లు వది లేస్తే నీ రూపంలో దేవుడొచ్చి సాయం చేసేడనుకున్నాను! అలాగే ఏదో దారి ఉండకపోదు! చూద్దాం. ఎటొచ్చీ నిన్నటి దాకా అంత ఆశలు పెట్టుకొన్న పసిదాని మనసు ఎంత చిన్నబుచ్చుకుందో అనే ఆలోచన బాధపెట్టింది కాని మరేంకాదు! నువ్వేం మనసులో పెట్టుకోకు," అంది రుక్మిణి.

మర్నాడు విషయం తెలిసిన శ్రీనివాసు కోర్టు కెక్కుదాం అన్నాడు. అనేక రకాలుగా ఆ వే శా లు చూపిస్తున్న అందర్నీ రాధ వారించింది.

"గుర్రాన్ని చెరువుదాకా తీసుకెళ్ళ గలం గాని నీరు త్రాగించగలమా నాయనా? బలవంతాన వాళ్ళ అహాన్ని కొట్టి మన అమ్మాయి నక్కడికి పంపినా గాయాలు రేగి పగలు ఇంకా ఎక్కువ అవుతాయి! ఈ విషయం నాకు వది లెయ్యండి! అది ఎప్పటికైనా సుశీలే పరిష్కరించు కునేటట్లు చెయ్యాలి," అంది. రుక్మిణికి కొంత ధైర్యం కలిగింది.

3

ఆనాటినుండి రాధ సుశీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఆమెను రోజూ అలంకరించేది. కట్టుకునే బట్టల దగ్గరనుండి ఎన్నికచేసేది. ఆమె హావ భావాల్లో మోటుగా బాగులేని వాటిని సంస్కరించింది. కంటికి కాటుక పెట్టు కోవడం దగ్గరనుండి తలలో పూలు పెట్టుకోవడం వరకూ ఒకదానికొకటి కుదిరేలా అన్నీ ఆమె శరీరానికి తగినట్లుగా మళ్ళీ ఏమాత్రం అసహజత్వం కనబడకుండగా తీర్చి దిద్దేది. పదిరోజుల్లో సుశీల ఇంత అందంగా ఉందా అని రుక్మిణే ఆశ్చర్య పోయింది.

ఆ తర్వాత ఒకరోజు ఆనంద్‌ను ఆ ఫీ సు లో కలుసుకోమని ప్రోత్స హించింది. ఆఫీసులో అతను ఎలా ఉంటాడో ఏంచేస్తూ ఉంటాడో వివరా లన్నీ సుశీలను అడిగింది. తెలుసు కున్న తర్వాత జరుగబోయే సమా వేశాన్ని నటించి చూపించింది. నటించే టప్పుడు అప్రయత్నంగా సుశీలస్థానంలో కృష్ణమూర్తిని ఊహించుకొని భావా వేశంతో కళ్ళ నీళ్ళు నిండిన రాధను చూసి సుశీల ఆశ్చర్యపోయింది.

"ఇదంతా నటన కాదమ్మా! నీ మనిషిని నువ్వు వలచినప్పుడు అతి సహజంగా వస్తాయమ్మా!" అంది రాధ.

ఆ మర్నాడు సుశీల పుట్టినరోజు.

మబ్బురంగు పట్టుచీరా జాకెట్టూ ధరించింది. తలంటుకొని పొడారిన జుట్టును వదులుగా ముదురు నీలిరంగు రిబ్బనుతో ముడివేసుకుంది. సన్నని గొలుసొకటి మంగళసూత్రంతో పాటు మెడలో వేసుకుంది. మబ్బురంగుకు పోటీగా మెడలోని కుత్తికంటూ, కళ్ళకు సన్నగా కాటుకా కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి.

ఆనంద్ కేబిన్‌లోకి సుశీల వెళ్ళేసరికి అతను ఎవరితోనో టెలిఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

సుశీలను చూడగానే మాట తడబడి ఏదో అయిందనిపించి ఫోను పెట్టేసేడు.

ఆమెనుండి దృష్టి మరల్చుకోలేక అలాగే చూసేడు. సుశీల అమాయకంగా రెప్పలు రెపరెపలాడించింది.

"సాహసించి ఇక్కడికి వచ్చినందుకు మన్నిస్తారు కదూ!" తెల్లని పెద్దకన్నుల్లో రెప్పల అంచున తళతళలాడిన కాంతి ఆనంద్ హృదయంలో అశాంతిని రేపింది. తనను అన్యాయం చేసినట్లు కోపంతో ఛావిస్తూ ఉంటుంది అనుకున్న సుశీలను ఇలా చూసేసరికి మనసు పట్టుతప్పి పోయింది.

"రెండు నిముషాలు కూర్చోవచ్చా?" అంది సుశీల.

"కూర్చో!" అన్నాడు మనసులో సానుభూతిని పైకి ప్రకటించకుండా ఆనంద్.

"మీ నాన్నగారు వ్రాసిన ఉత్తరం చదివేను. చిన్నప్పుడు స్కూల్లో చదువుకున్న తోడేలూ మేకపిల్ల కథ గుర్తుకొచ్చింది. అయినా నా పూర్వీకుల చరిత్రకు నే/నేంచేయగలుగుతాను. మీతో గడిపే క్షణంకోసం కలలుగంటూ ఉన్న నాకు....సరేలేండి! బహుశా నా అదృష్టం ఇంతేనేమో!....ఈ రోజు నా పుట్టినరోజు. చేసుకోవాలనిపించలేదు. సాహసించి ఒకసారి మీ దగ్గరకు ఎలాగైనా రావాలనీ, మిమ్మల్ని ఒకసారి కన్నులారా చూడాలని అనిపించి.... వచ్చేసేను. బహుశా ఇవి తినడానికి అభ్యంతరం ఉండదనుకుంటాను...." అని స్టీలుబాక్సు ఒకటి ముందుకు జరిపింది.

ఇంతలో ప్యూను కాఫీ తీసుకొచ్చేడు. మళ్ళీ పిలిచేలోపలే అతను బయటకు వెళ్ళిపోయేడు.

"మీకు అభ్యంతరం లేకపోతే మీ చేత్తో కొంచెం కాఫీ ఇవ్వండి," అంది.

ఇద్దరూ మౌనంగా చెరిసగం కాఫీ త్రాగేరు.

"మనం కలుసుకోవడానికి వీలులేకపోయినా ఆ విషయం బయట అందరికీ తెలికుండా ఉంచే మీకూ నాకూ కూడా కొంత అశాంతి తప్పుతుంది. మళ్ళీ మనసు పట్టలేనప్పుడు ఒకసారి చూసిపోతాను. ఏమీ అనుకోరు కదూ!"

కనురెప్పల్లో కన్నీళ్ళు తళతళలాడు తూంటే బయటకు వచ్చేసింది.

మరో పదిరోజుల తర్వాత ఒకరోజు సాయంత్రం కారులో బయటకు వెడు తూన్న ఆనంద్‌ను అతని ఆఫీసులో పనిచేసే కమల లిఫ్ట్ అడిగింది. బయట జోరుగా వర్షం కురుస్తూంది. ఆనంద్ కారు తలుపు తెరిచేడు. ఆమె లోపల కూర్చుంటూండే అప్పుడే ఎదురుగా ఆఫీసులోంచి బయటికొచ్చి వర్షంలో తడిసిపోయి సుశీల బస్‌కోసం చూస్తూ నిలబడింది. ఆనంద్ ఆమె ఒకరినొకరు చూసుకున్నారు. మర్నాడు ఆఫీసుకు వచ్చిన సుశీలతో మాటలమధ్య "ఆమె వర్షం వస్తూంటే లిఫ్టు ఇయ్యమంటే ఇచ్చేనంతే!" అని ఆనంద్ చెప్పకుండా ఉండలేకపోయేడు.

"ఎందుకు చెప్తున్నారు?" అంది సుశీల.

"నువ్వు మరోలా అనుకుంటావేమో నని?" అన్నాడు ఆనంద్.

"నాకు మరో ఆలోచన ఏమీ రాలేదు," అంది సుశీల.

క్రమంగా ఆనంద్‌లోని కఠినత్వం కరిగిపోయి సుశీల వచ్చినప్పుడల్లా మనసువిప్పి మాట్లాడటం మొదలు పెట్టేడు.

కొన్నాళ్ళ తర్వాత సుశీల ఆఫీసులో ఒక ఫంక్షను జరిగితే సుశీల నాట్యం చెయ్యడానికి ఒప్పుకుంది.

రాధ సుశీలకు ప్రత్యేకంగా నాట్యం నేర్పింది.

ఆనంద్‌ను సుశీల మరీ మరీ రమ్మని చెప్పింది. ప్రేక్షకులలో ఆనంద్‌ను చూసి సుశీల పరవశించి నాట్యంచేసింది.

ఆ తర్వాత కలిసినప్పుడు ఆనంద్ ఒక శనివారం సాయంత్రం పిక్నిక్‌కు వెడదామన్నాడు సుశీలతో. సుశీల సంతోషంగా ఒప్పుకుంది.

ఆ రెండు రోజులూ ఇద్దరూ ప్రపంచాన్ని మరచిపోయి సుఖ సాగరంలో మునిగిపోయేరు.

"దీనివల్ల నీకు అపవాదు వస్తే ఏం చేస్తావు?" అన్నాడు ఆనంద్.

"భర్తతో ఉన్నందుకు అపవాదు వేసే ప్రపంచాన్ని నేను లెక్క చెయ్యను. నాకు నా ఆత్మే సాక్షి," అంది సుశీల.

ఆ వాక్యం ఆనంద్ మనసులో ఏదో ప్రబోధించింది.

4

"ఏమండీ! రాధగారున్నారా?"

"ఎవరది?.... నేనే రాధను." అంది రాధ ఇంట్లోంచి బయటకువచ్చి. ఆమెకు ఒక నలభై సంవత్సరాలుంటాయి. రాధకు ఎప్పుడూ చూసిన గుర్తు రాలేదు.

"మీకు సుందరి తెలుసు కదూ?" అందామె.

"ఆ: తెలుసు."

"ఆమె చావుబ్రతుకుల్లో ఉంది. మిమ్మల్నివొకసారి చూడాలంటూంది."

"అలాగా! ఎక్కడా?"

"నాతో రండి, నేను తీసుకొని వెడతాను," అందామె. రాధ రుక్మిణితో చెప్పి వెంటనే బయలుదేరింది.

ఊరి బయట అదొక పాడుపడిన ఇల్లు. అందులో ఒక నులకమంచంమీద లేవలేక పడుకొని ఉంది సుందరి. కుష్టు రోగంతో శరీరమంతా శిధిలంకాగా గుర్తుపట్టడానికి కూడా వీలులేకుండా ఉంది.

"గుర్తుపట్టేవా రాధా?" అంది రాధను చూడగానే.

"నువ్వా సుందరీ! ఇలా అయిపోయేవేమిటి?" అంది రాధ.

ఆమెను చూడగానే బాధలో మనసు కరిగిపోయింది. తమ వృత్తి బ్రతుకు చివరకు తమకిచ్చే కానుకను కన్నులారా చూసింది.

ప్రసాద్ పోలీసుస్టేషనులో టెలిఫోను మ్రోగింది. ప్రసాద్ రిసీవరు తీసుకున్నాడు. ఊరిబయట జరుగుతూన్న ఒక అవినీతి చర్యకు అది కంప్లెయింట్.

వెంటనే ప్రసాద్ తన బలగంతో జీప్‌లో బయలుదేరాడు. ఊరిబయట అది ఒక పాడుపడిన ఇల్లు. సిబ్బంది ఇల్లు చుట్టుముట్టేరు. ప్రసాద్ లోపలకు వెళ్ళి అక్కడ వేరువేరు గదుల్లో కామక్రీడల్లో ఉన్నవాళ్ళను కస్టడీలోకి తీసుకున్నాడు. మరో గదిలో ఉన్న తల్లిని చూసి ఆశ్చర్యపోయేడు.

తాను తెలియక ఒక విషమ వ్యూహంలో చిక్కుకున్నట్లు గమనించేడు.

గత్యంతరం లేక చట్టప్రకారం తల్లిని కూడా కస్టడీలోకి తీసుకొని స్టేషనుకు తీసుకొచ్చేడు. తానే బెయిలు ఇచ్చి విడిపించి ఇంటికి తీసుకొని వెళ్ళేడు.

ఆచూకీ తీయగా దీని వెనుక నరసింహం అనే అతడున్నాడని తెలిసింది. అతనికి పోలీసు ఆఫీసర్లతో చాలా మందితో స్నేహం. అతనంటే తన సిబ్బందికూడా ఎంతో గౌరవంగా చూస్తారు. ఒకవైపు తాను తన కర్తవ్యాన్ని ఏమాత్రం తప్పకుండా అమలు జరపడం తోటివారిని విపరీత పరిస్థితుల్లో ఉంచడం వలన వారు ఇది కావాలని చేసిందని తెలుసు. కాని తల్లినెందుకు ఇందులో ఇరికించారో అర్థంకాలేదు. ఇంట్లో ఈ మాటలు వచ్చినప్పుడు నరసింహాన్ని గురించి పూర్తిగా రుక్మిణి చెప్పింది. సుశీల పెళ్ళిలో వచ్చి అన్నీ చూసి వెళ్ళేడనీ బహుశా సుశీల మామగారు రాసిన ఉత్తరానికి కూడా అతనే కారణం కావచ్చుననీ అంది. ప్రసాద్‌కు అంతా అర్థంఅయింది.

ముందు అతనికి పోలీసు ఆఫీసర్లతో స్నేహానికి కారణం ఏమిటని ఆచూకీ

తియ్యడం మొదలుపెట్టేడు ప్రసాద్. దానికి ఇదివరకు పోలీసు స్టేషను ముందు అల్లరిచేసిన జర్నలిస్టు అరుణ ఎంతో సహాయంచేసింది. ఆమెదగ్గర గతంలో వ్యభిచారగృహాలు నడిపే కొంతమంది పెద్దమనుషుల గురించీ వారికి అధికార వర్గాలతో ఉన్న లింకుల గురించీ కొన్ని వివరాలు ఉన్నాయి. అవి అన్నీ పూర్తిగా ఋజువులు లేకపోవడంతో తనకే ఎదురుతిరగవచ్చుననే భయంతో వాటిని ప్రకటించలేదు. అవి చూసిన ప్రసాద్‌కు అన్నీ స్పష్టంగా అర్థమయ్యేయి.

అయితే అవకాశం ఉన్నప్పుడే అన్నీ బయలుపరచాలని పైకి మాత్రం ఏమీ తెలియనట్లే ఉన్నాడు.

ప్రసాద్ ఊరిబయట చేసిన రెయిడ్‌లో పట్టుబడిన వారిమీద కేసు విచారణకు వచ్చింది.

కాని అందులో తల్లిని ఎలా శిక్ష పడకుండా చూడాలో అర్థంకావటంలేదు. తల్లి నిర్దోషి అని తెలుసు. కాని, అది కళ్ళు చెవులేకాని ఆలోచనా స్వాతంత్ర్యం లేని కోర్టుకెలా చెప్పడం అర్థంకాలేదు. రాధమాత్రం ఏమీ చలించలేదు.

కోర్టులో రాధను ప్రశ్నల వర్షం కురిపించేరు.

ఆమె సుందరిని చూడడం కోసం వెళ్ళేనని చెప్పగానే ఆమెతో ఎలా పరిచయం అనే ప్రశ్నతో మొదలుపెట్టి మొత్తం ఆమె గతాన్నంతా బయట పెట్టేరు.

చివరకు కోర్టులోకి సుందరి రావడంతో అందరి కళ్లూ ఆమె మీదకు మళ్ళేయి. నడవలేక కుష్ఠురోగంతో దేకు్కుంటూ వచ్చిన ఆమెకు భయపడి అందరూ పక్కకు తప్పుకున్నారు.

రామమోహనరావు బావమరిది నరసింహం ఒకరోజు తన దగ్గరకు వచ్చేడనీ రాధను గురించి ఎన్నో మాటలు చెప్పేడనీ చివరకు ఆమెను ఒకసారి చూడాలని ఉందా అని అడిగేడనీ చెప్పింది. వేశ్యావృత్తిలో సర్వనాశనమయిన అందరిమధ్యా ఒక మంచి దారిలోకి మళ్ళిన రాధను చూడడానికి సుందరి ఉవ్విళ్ళూరింది. ఆమెను ఊరిబయట ఒక పాడుపడిన ఇంటికి పంపించేడనీ రాధ అక్కడికి వస్తుందని చెప్పేడనీ చెప్పింది. కాని ఆ యింట్లో వేరే గదుల్లో ఏం జరుగుతున్నాయో తనకు గానీ రాధకు గానీ ఏమీ తెలియదనీ చెప్పింది. దాంతో రాధ విడుదల చేయబడింది.

అరుణను ఆ రోజు ప్రసాద్ ఇంటికి టీకి పిలిచేడు. ఆవేశంతో ఆమె సాంఘిక సమస్యలను గురించి రాజకీయాల వరకూ వాదించడం మొదలుపెట్టింది.

అంత చిన్న వయసులో ఆమె మాటలను వింటూంటే రాధకెంతో ముచ్చట కలిగింది.

మాటల మధ్యలో అరుణ అంది.

"....ఈ వేశ్యాగృహాలు మొగలి పొదల్లాంటివి. వాటిలో ఏదో సుఖానికి తారట్లాడి వెళ్లే వాళ్ళందరూ పాము కాటుకు గురికావలసిందే! వీటిని సమూలంగా నిర్మూలించే వరకూ ఈ సమాజానికి ముక్తి లేదు...." అని అప్పుడే టీ తెచ్చిన రాధను చూసి "మీరేమంటారు?" అంది.

"ఏమోనమ్మా! నేనేం చదువులు నేర్చినదాన్ని కాదు. కాని ఒకటిమాత్రం నా కనిపిస్తుంది. మనిషిలో ఉండే సహజమైన కోరికలు తీరే దారిలేనిదే వీటికి పరిష్కారం లేదు. తన ఆడతనాన్ని అసహ్యించుకొని, తన అందాన్ని మరుగుపరుచుకొని తన సృష్టికొక ప్రయోజనం ఉందని తెలియక కాపురంచేసే ఇల్లాలి చేతిలో ఏ మగడు సుఖపడతాడు. సుఖం పొందలేని ఏ మగవాడు బయటికిపోకుండా ఉంటాడు.

"ఒకనాడు వేశ్యాగృహాలు మొగలి పొదల్లాగే దూరంగా ఉండేవి. చట్టాలు చేసి వాటిని తెగనరికేరు. కాని మనిషి మారలేదుగా! ఇల్లాలు మారలేదుగా! కుష్ఠురోగం ఉన్నవాడు దాన్ని బయటికి కనబడకుండా బట్టలలో దాచుకుంచే నశించకుండా ఉంటాడా! మొగలి పొదల్లోని పాములు ఇళ్ళల్లోకే జొరబడతాయి...." అంది.

ప్రసాద్, అరుణా రాధ మాటలకు ఆశ్చర్యపోయేరు. ఆమె మాటల్లోని సత్యం కళ్ళకు కట్టినట్లు కనబడింది.

5

ప్రసాద్ స్టేషనుకు వచ్చేసరికి ఇనస్పెక్టర్ గోపీనాథ్, నరసింహంకూర్చొని పెద్దగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. గోపీనాథ్ లేచి సెల్యూట్ చేసేడు. నరసింహం అయిష్టంగానే లేచి విష్ చేసేడు. ప్రసాద్ ఇద్దరికీ విష్‌చేసి తన రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

తాను నమ్మకంగా పెట్టిన కొత్త కానిస్టేబిల్‌ను పిలిపించి విశేషాలేమిటని అడిగేడు.

ఆ రాత్రి నరసింహం పెద్ద పార్టీ ఇస్తున్నాడనీ దానికి గోపీనాథ్‌ను పిలవడానికి వచ్చేడనీ చెప్పేడు. ఇతనేకాక పార్టీలో మరి కొంతమంది పోలీసు ఆఫీసర్లూ గవర్నమెంటు ఆఫీసర్లూ ఉన్నారని తెలిసింది.

వెంటనే ప్రసాద్ తనను చాలా అభిమానించే పోలీసు కమిషనర్‌ను కలుసుకున్నాడు. ఉన్న సమస్య వివరంగా చెప్పేడు.

అతను ఈ పార్టీ ఇవ్వడానికి కారణం ఒక పెద్ద అవినీతి కరమైన చర్యను కప్పిపుచ్చుకోడానికి కావచ్చనీ, అదీకాక పార్టీలో కూడా చాలా అసభ్యమైన కార్యక్రమాలు ఉండవచ్చనీ చెప్పి అతని సంఘ ప్రతికూల చర్యలు నిలపడానికి ఈ అవకాశాన్ని తప్పకుండా ఉపయోగించుకోవాలనీ చెప్పేడు.

తగిన ఏర్పాట్లు చెయ్యడానికి కమిష నర్ అంగీకరించేడు. మఫ్టీలో నలుగురు ఆఫీసర్స్‌ను పార్టీలో పనిచేసేవాళ్ళుగా పంపించడానికి ఏర్పాట్లు చేసేడు.

తిరిగి ప్రసాద్ స్టేషనుకు వచ్చేసరికి అరుణ దగ్గర్నుంచి టెలిఫోను వచ్చింది.

ఆ రాత్రి నరసింహం జరపబోతున్న ఒక ఘాతుకమైన చర్యకు ఆధారాలు దొరికేయనీ అతన్నిప్పుడు ఆపకపోతే ఎందరో అమాయక యువతుల జీవితాలు నాశనం అయిపోతాయనీ వాదించింది.

ఇద్దరూ సాయంత్రం ఒక సంకేత స్థలం దగ్గర కలుసుకుంటే పూర్తి వివ రాలు చెప్పగలనంది.

ఆ సాయంత్రం అరుణ చెప్పిన చోటుకి ప్రసాద్ వెళ్ళేడు. ఆమె చెప్పిన టైము దాటిపోయి పది నిముషాలయింది కాని ఆమె రాలేదు.

ప్రసాద్ ఆందోళన చెందేడు. ఇంతలో స్టేషనునుంచి ఒక కానిస్టేబుల్ ప్రసాద్ దగ్గరకు వచ్చేడు.

అరుణ పనిచేసే ఆఫీసునుండి టెలి ఫోను వచ్చిందనీ అరుణ నెవరో ఎత్తు కుని పోయారనీ చెప్పేడు.

ప్రసాద్ వెంటనే ఆమె పనిచేసే పత్రిక ఆఫీసుకు వెళ్ళేడు.

ఆమె ఈ మధ్య అందమైన యువతు లను బలాత్కారంగా దొంగిలించి విదేశా లకు తీసుకొనిపోయి వేశ్యావృత్తికి అమ్మబోతూన్న ఒక ముఠాను గురించి వివరాలు సేకరించిందనీ ఇప్పుడు ఆమె మాయమవడం ఆమెను అధికారులకు దూరంగా ఉంచడం కోసమేననీ తెలుసుకున్నాడు.

ఆమె టేబుల్లోని కాగితాలన్నీ వెదుకగా ఒక చిన్న బొమ్మ దొరికింది. అందులో ఊరికి పాతికమైళ్ళ దూరంగా ఒక చోటు గుర్తించబడి ఉంది. మిగిలిన చాలా కాగితాల్లో ఆ చోటుకు సంబంధం ఉన్నట్లుగా ఉంది.

తగిన బలగం తీసుకొని అటువెళ్లేడు ప్రసాద్.

6

రాత్రి నరసింహం ఇంట్లో భారీఎత్తున పార్టీ జరుగుతూంది. మత్తుగా విదేశీ సంగీతం హాలంతా సుగంధ పరిమళాలతోబాటు అలుము కుంటూంది. వాటితో కలసి సిగరెట్ పొగలూ మసాలా వాసనలూ కలసి పోయేయి.

ప్రత్యేకంగా అందర్నీ తానే స్వయంగా కలుసుకొని మర్యాదచేసేడు నరసింహం. చివరకు హాతురు మాలినికి సైగచేసి తాను ఓసారి వాచీ చూసుకొని అంద రితో కొద్దిసేపట్లో వస్తానని బయటకు వెళ్ళేడు.

నిషాలో ఉన్న అందరూ ఒక్కసారి కలిగిన సంచలనం చూసి హాలు మధ్యకు దృష్టి మరల్చేరు.

పదిమంది నవయౌవనంలో ఉన్న యువతులు నాట్యం ప్రారంభించేరు. వారిమధ్య రాణిలా ఉంది మాలిని.

సంగీతంలో స్పీడు ఎక్కువవుతూంటే త్రాగేవారి మెదడులో మత్తు పెరుగుతూంటే అందరూ ఒక్కొక్క వస్త్రాన్నే నేలకు జారవిడుస్తున్నారు.

అరగంట గడిచేసరికల్లా మాలినితో పాటు యువతులందరూ శరీరంమీద ఏ అచ్ఛాదనాలేక నగ్నంగా నిలబడ్డారు. ఉద్రేకపూరితమైన ఆ వాతావరణంలో మరోసారి సంచలనం కలిగింది.

బయట పోలీసువ్యాన్ వచ్చింది. లోపల సర్వర్స్ వేషంలో ఉన్న ఆఫీసర్స్ బయటకు పోయేవారిని అటకాయించేరు.

అక్కడ సుమారు ఇరవై మంది యువతులను రహస్యంగా విదేశాల కోసం బొంబాయి పంపడానికి ఏర్పాటు చేస్తూన్న నరసింహం ప్లానంతా తల్లక్రిందులు చేసేడు. అన్నింటికీ సిద్ధపడిన నరసింహం మారణాయుధాలతో ప్రసాద్‌ను ఎదుర్కొన్నాడు.

ప్రసాద్ ప్రాణానికి లెక్కచెయ్యకుండా తెగించి చిట్టచివరకు నరసింహాన్ని చేజిక్కించుకున్నాడు. అలాగే అదే యింట్లో బంధింపబడిన అరుణను కూడా విడిపించుకున్నాడు.

ఆ కేసులో నిందితులకు శిక్షవేసి తీర్పు చెప్తూ జడ్జి ఇలా అన్నాడు:

"ఒకప్పుడు వేశ్యావృత్తిలో పుట్టి పెరిగినవారందరూ అందులోని నైచ్యాన్ని గుర్తించి సంఘంలో బాధ్యత గల పనులను తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తూంటే, గతంలో సమాజంలో ఉన్నత కుటుంబాల్లో పుట్టి పెరిగినవాళ్ళే తమ కన్నకూతుళ్ళనుకూడా ఈ వృత్తిలోకి దింపడం చాలా విచారాన్ని కలుగచేస్తూంది. ఒక జాతి ఒక తరంలో నుండి మరో తరంలోకి పురోగమిస్తూంటే మరొక జాతి ఒక తరంలోనుంచి మరో తరంలోకి తిరోగమించడం చదువుకున్న వారి సంస్కృతి ఎంత నీచాతినీచంగా దిగజారిపోతూందో తెలుస్తూంది. అంతరాత్మ ఉన్న ప్రతిమనిషీ ఇది శాయశక్తులా నిరోధించవలసిన విషయం."

అందరికంటే ఎక్కువ శిక్ష నరసింహానికి పడింది.

మాలినికి కూడా శిక్ష పడింది.

7

ఎదురుగా నిలబడిన ఆనంద్‌ను చూసి రాజారావు తలెత్తేడు. ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసేడు.

"నాన్నా! నేను సుశీలను తీసుకురావాలనుకుంటున్నాను."

"ఎక్కడికి?"

"మనింటికి."

"వీల్లేదు."

"ఎందుకో తెలుసుకోవచ్చా?"

"నీకు ఇదివరకోసారి చెప్పేను.

వాళ్ళకు ఒక వేశ్యతో సంబంధం ఉందని తెలిసింది."

"కాని ఆమెను మనంతట మనం కావాలని పెళ్ళి చేసున్నాం."

"వాళ్ళు ముందే ఈ విషయం చెప్పి ఉండవలసింది."

"ఏమని?"

రాజారావుకు వెంటనే జవాబు తోచ లేదు.

"మా కుటుంబానికి ఒక వేశ్యతో సంబంధం ఉందనా?"

"ఏమయినా సరే ఆమె నిక్కడికి తీసురావడానికి వీలులేదు."

"అయితే నేనే ఆమె దగ్గరకు వెడు తున్నాను."

"బాగా ఆలోచించుకున్నావా?"

"బాగా ఆలోచించుకునే చెప్తున్నాను. కాని మీరు మనసు మార్చుకొని ఎప్పుడు పిలిచినా తి రి గి వ స్తా ను సుశీలతో కలసి."

రాజారావు నిశ్చేష్టుడయి నిలబడి ఉండగానే ఆనంద్ తన బట్టలు ఒక సూట్ కేస్‌లో సర్దుకొని బయటికి నడచి వెళ్ళిపోయాడు.

ఆనంద్‌ను చూసి ఇంటిల్లిపాదీ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యేరు. రుక్మిణి కళ్ళల్లోనుండి ఆనందబాష్పాలు జలజలా రాలిపోయేయి.

వంటింట్లో పనిచేస్తూన్న రాధ దగ్గర కెళ్ళి అమాంతం కౌగలించుకుంది. ఆనంద్ రావడం విని ఎంతగానో సంతో షించింది రాధ. కళ్ళు మూసుకొని ఒక్క సారి మనసులో కృష్ణమూర్తిని ధ్యానించు కుంది.

"మొత్తానికి మా చెల్లాయి వావగార్ని ఇంటికే రప్పించుకుంది" అన్నాడు ప్రసాద్ సుశీలను చూసి.

"నువ్వుకూడా మా అన్నయ్యను ఇంటికే రప్పించుకో!" అంది సుశీల ప్రసాద్ పక్కనే ఉన్న అరుణతో.

అందరూ ఒకే కుటుంబంగా కలసి ఉండడం చూసిన రాధఆనందానికి పట్ట పగ్గాల్లేవు.

ఆ రాత్రి సుశీల మల్లెపూల జడ కడుతూ "మొగలి పొదలు పెరట్లో నాటుకోవడం మంచిది కాదు కాని ఏకాం తంగా భర్త ఒడిలో చేరబోతూ కట్టు కున్న మల్లెపూల జడలో ఒక్క మొగలి రేకు మాత్రం తప్పకుండా ముడుచు కోవాలమ్మా! అప్పుడే శోభవస్తుంది" అంటూ భవగర్వితంగా సుశీల కళ్ళల్లోకి చూసింది రాధ.

అందులో భావాన్ని గ్రహించి సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కగా తల వంచుకుంది సుశీల.

(సమాప్తం)

Printed and Published by A Chandra Sekhar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001 Editor. A. SUDHAKARA RAO